


'గొంతుతోంది'

..........

'గొంతుతోందే'

'అయితే నన్నేం చెయ్యమన్నారు.'

'దీనికీ రోగం ఎప్పుడు పోతుందో గాని...'

'తీసుకువెళ్ళి బాగుచేయించండని నోరు నొప్పి పుట్టేటట్టు చెప్తూనేవున్నాను.'

'పగలు జ్ఞాపకం చెయ్యకూడదూ?'

'నూరు రూపాయిలు జీతం తెస్తూండే మీ తెలివి తేటలకే జ్ఞాపకం లేకపోతే...'

'ఇదేం రోగమో'

'పోనీ యిప్పుడు తీసుకు వెళ్లకూడదూ!'

'మనకోసం వాళ్లు కూర్చుంటా రనుకున్నా వేంటి'

'పోనీ రేపైనా మరిచిపోకుండా తీసుక వెళ తారా'

'రేపటిదాకా వెళుతుంది, యీ రాత్రి యీ కాయితాలన్నీ వ్రాయకపోతే ఎలాగ. అన్నీ అర్జంటే.'

'రేపు పదకొండు గంటలకి కదా ఆఫీసు, ఉద యమలేచి వ్రాసేయకూడదూ.'

'యీ దస్తరాన్ని చూసేమాట్లాడుతున్నావా'

'అదేమో బాబు నాకేం తెలుస్తుంది.'

'నీకేం తెలుస్తుంది. ఇదేం ఉష్మా చెయ్యడం అనుకున్నావేంటి. శ్రద్ధినంపంట తంతు. యిప్పుడు బోధపడిందా.'

'పోనీ నేనుకూడా సాయం చెయ్యనా'

'సరే, అదే బంగారమైతే అమ్మకునే తిందు నన్నాట్ట.'

దీపం గప్పునమండి ఆరిపోయింది.

'పాడింది మంగళం! యుద్ధంలో తయారయిన అన్ని లాంతర్లకీ యిదే రోగమల్లే ఉంది'

'లేచి చక్కా భోజనం చెయ్యండి. లేకపోతే ఆదీపం మంగళం పాడేస్తుంది. చమురులేదు.'

'ఎప్పుడూ ఏదో ఒకటి లేదంటూనే ఉంటావే'

'ఉంటే అనవలసి ఎందుకు వస్తుంది.'

'ఆడవాళ్ళ లక్షణమే అంత. ఇంక చూడు తిరిగీ రేషనింగు పెడతారుట'

'పోనీండి. పైపైని కుంచం నాలుగు రూపా యిలకో అయిదు రూపాయిలకో దొరుకుతాయి కదా.'

'పైనా! నాలుక్కాదు నలభై రూపాయిలు యిచ్చినా ఒకగింజ దొరకదు.'

'అయితే మరెలాగ.'

'ఎలాగేమిటి. అలాగే. రోజుకు నాలుగు ఔన్సులు బియ్యం. అంటే పదితులాలు. నీ లెక్కకి చెప్తాను విను సరిగ్గా అరసోలడు.'

'రోజూకా'

'మరేం.'

'ఎలా సరిపోతాయండీ! ఒక పూటకే చాలవు కదా.'

'అలాగే కాలక్షేపం చేసుకోవాలి.'

'ఎంత పొందికగా కాలక్షేపం చేసుకున్నా ఎలా చాలతాయండి.'

'ఒకపూట తినడం, రెండో పూట...'

'పస్తే'

'మహారాజులాగ. లేకపోతే రాత్రి వేరుశనగ పప్పు తినడం మంచినీళ్లు తాగడం'

'ఉండగలమా ?'

'ఉండాలి. గాంధీగారు అలా ఉండేవారు కారూ ? ఎన్నాళ్లనుంచి చెపుతున్నా గాంధీగారి తత్వం అవలంబిస్తే బాగుంటుందని. చెవిని పెట్టావా! దారం తియ్యబడుతుందని ఆ రాట్నాన్ని విరిచి మూల తోసేసేవ్ కదా. ఈమధ్య కర్రలు లేవని అఘోరించావు. పొయ్యిలో పెట్టేలేదుకద ?'

'బాగుందండి. మీరూ మీ మాటలూ. నేను విరిచేశా నంటారు. మీరు కళ్లారా చూస్తూండగానే విరిచేశాడా నానిగాడు'

'ఎలాగో మెల్లిగా పనికిరాకుండా అయింది కదా. నాలుగుదారాలు రోజూ తీస్తే ఏ ధోవతో లేక చీరో అవదూ. యికచూడు బట్టలకి కూడా రేషనింగు వస్తోంది. అప్పుడు తెలుస్తుంది. ఏం చెప్పినా బుర్రకెక్కుతుందా ! గిరీశం చెప్పినట్టు ఆత్మానుభవం అయితేగాని తత్వం బోధపడదులే'

'యీ రేషనింగువాళ్ళకి ఏమీ ఊసుపోదుటండీ'

'మొత్తానికి తెలివైన ప్రశ్నే వేశావు.'

'ఇప్పుడైనా రెండుబస్తాలు కొనుక్కుని దాచుకుంటే ఏం ?'

'డబ్బో. అదీగాక తనికీచేసి పట్టుకుంటారు'

'మొత్తంమీద వీళ్లు బతకనిచ్చేటట్టు లేదు. పోనీ ఆ వేరుశనగకాయలైనా రెండుబస్తాలు కొనండి. దానికూడా రేషనింగు పెట్టారంటే...'

'దానికూడా రేషనింగు పెడితే గాంధీగారి ఆఖరుతత్వం నిరశనవ్రతం ఉండనేఉంది. నీ బుర్రకెక్కదుగాని గాంధీగారి సూత్రాల్ని మనం అక్షరాలా అమల్లో పెట్టామంటే ప్రతి క్లిష్టసమస్యనీ ఎదుర్కోవచ్చు'

'అందర్నీ గాంధీమహాత్ములైపోవా లంటారు మీరు.'

'మన పూర్వీకులు చేసినట్టు మనం కూడా యిక ప్రతి ఏకాదశికీ ఉపవాసం, శని ఆదివారాలనాడు ఒంటిపూటా, మొదలైనవన్నీ ఆచరణలో పెట్టాలి.'

'బాగుంది. మూడుపూట్లా తింటూంటేనే మొఘం తిరుగుతోంది. ఇక అడిగారా. అదీగాక యిప్పటి బియ్యంలో సత్తువే లేదు.'

'మనం అన్నింటికీ తయారై ఉండాలి.'

'ఈవాళ బియ్యం రేషనంటే భోజనం మానీమన్నారు. రేపు బట్టకి...'

'అయితే యిదంతా నేను కల్పించా నంటావేమిటి.'

'మీకు సంతోషమేగా. బట్టలు కుప్పలు కుప్పలుగా దొరికేటప్పుడే లేదు. యికమీదట అసలే ఉండదు. తప్పించుకుందికి అవకాశం కూడా దొరికింది.'

'నేను చెప్పాను కదూ. ఎన్ని ఉన్నా లేవంటుండడం ఆడవాళ్ల లక్షణం అని. చీరలు లేకుండానే కాలక్షేపం చేస్తున్నావు కామోసు యిల్లాలుని.'

'అప్పుడు దొరకవు కామోసు రేపు వెళ్లి నాలుగు చీరలు తీసుకు రాకూడదండి.'

'డబ్బుంటే నాలుగుకాదు నలభై తీసుకురావచ్చు'

'నా దగ్గరికి వచ్చేసరికే డబ్బు ఉండదు.'

'అయితే యిప్పుడు బియ్యమే కొనడమా, వేరుశనగ కాయలే కొనడమా, దీపమే బాగుచేయించుకోవడమా, యీ కాయితాలే రాసుకోవడమా.'

'అన్నీ సమస్యలే. ముందు వేగం కాళ్లు కడుక్కోండి. ఆ దీపంకూడా గెంతుతోంది. మాటల్లో మంగళం పాడేస్తే, ఎప్పుడో పస్తుపడుకుంటామో లేదోగాని యిప్పుడు పడుకోవాలి.'